

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 237 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 21 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి

అభివృద్ధి ఆగకూడదు.. పర్యావరణానికి గాయం చేయకూడదు

బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభంలో సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు మరో నగరం నిర్మించే అవకాశం: కర్ణాటక సీఎం డీకే



**బెంగళూరు,మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తు తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రతి ఇల్లూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కేంద్రం కావాలని, అప్పుడే సాధారణ విద్యుత్ ఉత్పత్తిపై భారం తగ్గనుందని అన్నారు. ఆదివారం బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన విస్టా స్పేసెస్ ఎకో ఫ్రెండ్లీ విధానంలో నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను నిర్మించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీ సైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవనం ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం చంద్రబాబు మిగతా2లో...



## ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

● పశ్చిమ బెంగాల్‌లో 38.2 లక్షల అప్పీళ్లలో 22.2 లక్షలు తొలగించిన ఓటర్లవే ● విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చిన ట్రిబ్యునళ్లు : కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ:మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా తొలగించిన ఓటర్లలో 82 శాతం మంది తమ పేర్లను తిరిగి చేర్చాలని అప్పీల్ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం.. సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎన్నికల జాబితా నుంచి పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు ప్రక్రియపై కొనసాగుతున్న న్యాయపరమైన పరిశీలనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఎన్నికల సంఘం సమర్పించిన గణాంకాల ప్రకారం.. ప్రత్యేక ట్రైబ్యునళ్ల ముందు మొత్తం 38.2 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిలో 22.2 లక్షల అప్పీళ్లు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన నిర్ణయాలకు వ్యతిరేకంగా దాఖలైనవే. సవరణ ప్రక్రియలో తొలగించి విచారణకు ఉంచిన 27 లక్షల మంది ఓటర్లతో పోలిస్తే ఇది సుమారు 82 శాతానికి సమానం. మరోవైపు, ఓటర్లను జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ కనీసం 16.1 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లను మిగతా2లో...

## అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

ఎన్నికల కమిషనర్ సంధు, ఆర్మీ మాజీ చీఫ్ ద్వివేది, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు కూడా

జాబితాలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఎంపీ సిబల్ తదితర ప్రముఖులు




## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...

ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం

విషప్రచారాన్ని నమ్మొద్దు : రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిగతా2లో...

## ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

● అజీజ్‌నగర్ అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు

● కేటీఆర్ లీజు డ్రామాలు, బినామీ ఆస్తుల బాగోతం

● కాంగ్రెస్ క్షేత్రస్థాయి పర్యటనలు..రాజకీయ ఉద్రిక్తతలు



**మొయినాబాద్,మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో ఫామ్‌హౌస్‌ల సంస్కృతి విపరీతంగా పెరిగిపో యిందని, అజీజ్‌నగర్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో అనేక అక్రమాలు, రేవ్ పార్టీలు జరిగాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'ఫామ్‌హౌస్ ఫైల్స్' నడుస్తున్నాయని, రంగనాయక సాగర్ నుంచి మొదలుపెట్టి ఎర్రవెల్లి, జన్వాడ, అజీజ్ నగర్ వరకు ఉన్న ఫామ్‌హౌస్‌ల బాగోతాలను ప్రజల మిగతా2లో...




## ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

## కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు



**హైదరాబాద్:మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా మిగతా2లో...

## నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

- 1500 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- రేపు కాకినాడలో జనసేన ఎన్నికల సన్నాహక సమావేశం




## నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత



**హైదరాబాద్: మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య మిగతా2లో...

మన జనప్రగతి
21 - 09 - 2026

# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. నగరాలు పూర్తిగా కాంక్రీట్‌మయంగా మారాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే విధానం వస్తోందన్నారు. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణహిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని స్పష్టం చేశారు.

**పర్యావరణ సమస్యలను అధిగమిద్దాం**

వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న సవాల్ అని చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. భవన నిర్మాణాల్లో నెట్ జీరో విధానాన్ని అవలంబించాలని, సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యమివ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతోపాటు రీయూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని కొనియాడారు. ఇలాంటి పర్యావరణహిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని... ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమని సూచించారు. స్వచ్ఛమైన విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి ఇంటి పైకప్పును ఒక పవర్ ప్లాంట్‌గా మార్చవచ్చని, ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించుకోవచ్చని, ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చుకోవచ్చన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనన్నారు. వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఇదే స్ఫూర్తిని పట్టణాభివృద్ధిలోనూ అవసరమని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ 'ది ఎర్త్ సెంటర్' ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచినేని, ప్రవీణ్‌కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని చంద్రబాబు అభినందించారు.

**అమరావతి ల్యాండ్ పూలింగ్ అద్భుతం: డీకే ప్రశంసలు**

మరావతిలో అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీంపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో వివిధ ప్రాంతాల అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, కొత్త నగరాలు, కొత్త ప్రాంతాల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ ప్రస్థానంలో ఎదురయ్యే ఇబ్బందులకు చంద్రబాబు అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీం మార్గనిర్దేశం చేసిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌ను చంద్రబాబే తొలిసారి అమలుచేశారని ప్రశంసించారు. ఈ విధానాన్ని చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో భూములిచ్చిన వారిని భాగస్వాములను చేయడమనేది చాలా మంచి ఆలోచనగా పేర్కొన్నారు. చంద్రబాబు ముందుచూపు, నిబద్ధత కలిగిన నేత అని కొనియాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబుదే కీలక భూమిక అన్నారు. మరో అందమైన అమరావతి నగరం నిర్మించే అవకాశం ఆయనకు దక్కిందన్నారు. బెంగళూరు పరిధి దాటి అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ 1.4 కోట్ల మంది జనాభా ఉంటే... 1.3 కోట్ల వాహనాలు ఉన్నాయని చెప్పారు. ఇక్కడి రోడ్లను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. దక్షిణ భారత్‌లో మేధస్సుకు కొదవలేదన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది కీలకమన్నారు. సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన భవన నిర్మాణానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. విస్టా స్పేసెస్ జాయింట్ ఎండీ రఘువీర్ వీరమాచనేని, శ్వేత, రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

(మొదటి పేజీ తరువాయి)

పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.

**భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం**

భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. భూముల రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

(మొదటి పేజీ తరువాయి)

ముందుంచు తున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ నేతలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో పర్యటించి, ఫామ్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజీజ్‌నగర్‌లోని ఆ ఫామ్‌హౌస్ అసైన్డ్ భూమి అని, 111 జీఓ పరిధిలో ఉన్న ఆ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకునే అధికారం రోహిత్ రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ఆగర్భ శ్రీమంతులం అంటారని, మరొక రోజు తమకు హైదరాబాద్‌లో ఇల్లు కూడా లేదని డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్.. సత్యం రామలింగరాజు కంపెనీ భూముల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, నార్సింగిలో ఉంటున్నానని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో ఈగల్ ఫోర్స్ దాడులు చేసి ఏం జరిగిందో అందరికీ తెలుసని, అమెరికాలో చదువుకుని వచ్చి కేటీఆర్ తెలంగాణలో నేర్పిన సంప్రదాయం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ ఏడాది మార్చిలో పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో డ్రగ్స్ వ్యవహారం బట్టబయలైందని తెలిపారు. అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో డ్రగ్స్ తాగినట్టు తేలిందని, పైలట్ రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు చెందిన కేదార్ అనే వ్యక్తికి రూ.25 లక్షలు చెల్లించారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ కేదార్ 2025లో దుబాయ్‌లో డ్రగ్ ఓవర్ డోస్‌తో మరణించాడని తెలిపారు. నార్త్ ఇండియాకు చెందిన ఆ వ్యక్తులతో వారికి ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాలుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తన ఫామ్‌హౌస్‌ను ప్రదీప్ రెడ్డి పేరు మీద రాయించి, ఆ భూములను తన భార్య, అత్త కుటుంబ సభ్యుల పేర్ల మీద మార్చుకున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ దందాల అసలు బాగోతం తెలంగాణ ప్రజలకు తెలియాలనే తాము క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని ఫామ్‌హౌస్‌ల పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకుల అసలు బండారం త్వరలోనే ప్రజల ముందు పూర్తిగా బయటపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసుల బందోబస్తు**

షాబాద్ మండలం మద్దూర్ గ్రామ శివారులోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసులు ఆదివారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు అక్కడికి వస్తారన్న సమాచారంతో ఇన్‌స్పెక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు ఫామ్‌హౌస్ వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు అక్కడే విధులు నిర్వహించారు. అయితే ఈ సమయంలో కాంగ్రెస్ నేతలు ఎవరూ అక్కడికి రాకపోవడంతో పోలీసులు తిరిగి షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

# ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

**హైదరాబాద్:మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** కాంగ్రెస్ నేతలు కెసిఆర్ ఫాంహౌస్ భూముల సందర్శనకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. "ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?.. అధికార పార్టీ నేతలు అక్కడికి వెళ్లడమేంది?.. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారు?.. పాంహౌస్‌లో సర్కార్ భూములుంటే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది.. ఆ విషయాన్ని వదిలేసి ఈ రాజకీయ డ్రామాలేంది?" అని మండి పడ్డారు. కెసిఆర్ కుటుంబం, బిఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్ల భూదోపిడీ చేసినట్లు ఆధారాలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు భయపడి కాంగ్రెస్ పార్టీ అనర్హత కేసులో స్టే కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిందని ఎద్దేవా చేశారు. ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ట్రైసైకిల్స్, ఫాగ్ మిషన్స్ అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో చెత్త సేకరణ కోసం ప్రతి డివిజన్‌కు ఒక ట్రై సైకిల్‌ను మున్సిపల్ సిబ్బందికి అందజేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ఫాగ్ మిషన్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నా మన్నారు. రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులకు టెండర్లు మొదలు కాబోతున్నాయన్నారు. రూ.80 యూసీఎఫ్ నిధులతో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులు చేపట్టబోతున్నామన్నారు. 16 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులను ప్రారంభించబో తున్నామన్నారు.కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్ అని అన్నారు. ప్రైవేట్ భూములను సందర్శించడానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు అధికారం ఎక్కడిదన్నారు. ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూములుంటే అధికారులను పంపి స్వాధీనం చేసుకోవాలని, వాటికి సంబంధించిన ఆధారాలను సిఎం బయటపెట్టాలన్నారు. 22ఏ జాబితాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు 22ఏను తమకు అనుకూలంగా వాడుకున్నారన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. ఉప ఎన్నికలో పోటీ బిజెపి, బిఆర్ఎస్ మధ్యనే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ను జనం అసహ్యించుకుంటున్నారన్నారు. దానం నాగేందర్ తనను తాను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యమన్నారు. వినాయుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయాన్ని దానం నాగేందర్ గుర్తుంచుకొని జాగ్రత్త పడితే మంచిదన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమన్నారు.

# ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరు దాఖలు చేశారనే విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించలేదు.

**విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం చేర్పులు**

మొత్తం 38.2 లక్షల అప్పీళ్లలో సుమారు 1.2 లక్షల కేసులను మాత్రమే అప్పటికి ట్రైబ్యునళ్లు పరిష్కరించాయి. అంటే మొత్తం అప్పీళ్లలో 3.1 శాతం కేసులపై మాత్రమే నిర్ణయం వెలువడింది. ఏప్రిల్‌లో ట్రైబ్యునళ్లు అప్పీళ్ల విచారణ ప్రారంభించాయి. కోర్టుకు సమర్పించిన అనుబంధ గణాంకాల ప్రకారం.. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93 శాతం కేసుల్లో ఓటర్లను తిరిగి ఎన్నికల జాబితాలో చేర్చారు.

**లక్షలాది ఓటర్లపై సవరణ ప్రభావం**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టారు. ఫిబ్రవరిలో విడుదలైన తుది జాబితాలో తొలుత 61 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు చేర్చబడలేదు. అనంతరం అనుబంధ జాబితాలు, విచారణ ప్రక్రియ ద్వారా సుమారు 60 లక్షల అనుమానాస్పద, పెండింగ్ కేసులను పరిశీలించే ప్రక్రియ కొనసాగింది. ఏప్రిల్ 6 నాటికి సుమారు 91 లక్షల మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని నివేదికలు పేర్కొన్నాయి. ఇది సవరణ ప్రారంభానికి ముందు ఉన్న పశ్చిమ బెంగాల్ మొత్తం ఓటర్ల సంఖ్యలో దాదాపు 11.9 శాతం. దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తొలగింపుల ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడిందా అనే అంశంపైనా పలు విశ్లేషణలు వెలువడ్డాయి.

# అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

**న్యూఢిల్లీ, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్నికల సంఘం పలువురు పౌరులతో పాటు ప్రముఖుల పేర్లను ఎడాపెడా తొలగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రధాన లక్ష్యంగా 'సర్' నిర్వహించాల్సి ఉండగా, అది పూర్తిగా దారితప్పుతున్నట్టు కనిపిస్తున్నది. తాజాగా సాక్షాత్తూ ఎన్నికల కమిషనర్ ఎస్ఎస్ సంధు, కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్, ఆయన భార్య క్యోకో జైశంకర్, బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి 'సర్' నోటీసులు జారీ అయ్యాయి.వీరు కాక, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, అతని కుటుంబ సభ్యులు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, అతని కుటుంబం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అతని భార్య, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రంజన దేశాయ్, కుటుంబ సభ్యులు, ఎంపీ కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరు కాక ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, అతని కుటుంబ సభ్యులు, అద్వానీ కుమార్తె ప్రతిభా అద్వానీకి కూడా ఈసీ ఇప్పటికే నోటీసులు అందజేసింది. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ప్రకాశ్ రాజ్, ఎంపీ రాఘవ్ చద్దా, న్యూఢిల్లీ ఎంపీ బాన్సురి స్వరాజ్, బీజేపీ ఢిల్లీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర కుమార్ సచ్‌దేవా తదితరులకు నోటీసులు జారీ అవ్వడం వివాదాస్పదమైంది.

# నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

**పిఠాపురం, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** కేరళంలో చికిత్స అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. సోమ, మంగళవారాల్లో ఈ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రూ.1500 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంగళవారం పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో నిర్వహించే బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

# నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.."నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు.ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే కొడంగల్ వచ్చానని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, రాష్ట్రంలో విద్యా బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

# తెలంగాణలో 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు..

**హైదరాబాద్ :మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** తెలంగాణలో విద్యార్థులకు దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు 13 రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ సెలవులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు వర్తిస్తాయి. సెలవులకు ముందు అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

# ఈ నెల 22 నుంచి రైతు రిజిస్ట్రేషన్..



**హైదరాబాద్ :మన జనప్రగతి, సెప్టెంబర్ 20:** రాష్ట్రంలో రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించ నున్నారు. రైతులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. విత్తనాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లకు, ఎరువుల విక్రయాల కోసం, బ్యాంకుల ద్వారా రుణాల పొందేందుకు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకురైతు ఐడీ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, భూమి వివరాలు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రైతులు తమకు కేటాయించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇఓ) వద్ద లేదా సంబంధిత సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22 నుంచి -30 వరకు గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

# సాయిపేటలో మిస్సింగ్ అయిన ఇద్దరు బాలికలు

## - 24 గంటల్లో బెంగళూరులో ఆచూకీ

**కడప, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:–** కడప 11 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిపేటలో మిస్సింగ్ అయిన ఇద్దరు బాలికలను పోలీసులు 24 గంటల్లో బెంగళూరులో సురక్షితంగా గుర్తించి కడపకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.క్రైమ్ నంబర్ 147/2026 కింద కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బాలికలు కడప నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు వెళ్లినట్లు గుర్తించారు.ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ బాలస్వామి రెడ్డి పర్యవేక్షణలో 11 టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీహరి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం బెంగళూరుకు వెళ్లి బాలికలను గుర్తించింది. మిస్సింగ్ కేసుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# వర్షాలతో చెరువులు, కుంటలకు చేరుతున్న నీరు



**మదనపల్లె, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:–** అన్నమయ్య జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీరు చేరుతోంది. వాగులు, వంకలు, ఫీడర్ చానళ్లు, కాలువల ద్వారా నీరు నీటి వనరులకు చేరుతుండటంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.జిల్లాలో సాధారణంగా ఇప్పటివరకు 353 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 149 మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో 57.7 శాతం లోటు కొనసాగుతోంది. తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గడంతో పాటు పలు నీటి వనరులు అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం జలధార కార్యక్రమంలో చేపట్టిన ఫీడర్ చానళ్లు, కాలువలు, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం ఉపయోగపడుతున్నాయి. సోమల, పీలేరు, కలికిరి, కలకడ, నిమ్మనపల్లె తదితర మండలాల్లోని పలు చెరువులు, కుంటలకు వర్షపు నీరు చేరుతున్నట్లు అధికారులు తెలిపారు.మరో వారం, పది రోజుల పాటు వర్షాలు కొనసాగితే మరిన్ని నీటి వనరులకు నీరు చేరడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. తాగునీటి వనరులకు కూడా నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

# పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**మదనపల్లె, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:–** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రం మదనపల్లెతో పాటు డివిజన్, మండల స్థాయిలోని అన్ని కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజలు నేరుగా పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించవచ్చని, అలాగే ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీల స్థితిని తెలుసుకునేందుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా కూడా స్పందన తెలియజేయవచ్చన్నారు.మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులు జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు.

# మధ్యాహ్న భోజన పథకం వివరాలపై సమగ్ర విచారణకు పీడీఎస్‌యూ డిమాండ్




**రాయచోటి, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:–** అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు, చిక్కీల సరఫరా, విద్యార్థుల సంఖ్య, ఇండెంట్లు, బిల్లులు, చెల్లింపుల్లో తేడాలపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.రాయచోటిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, 2025 జూన్ నుంచి డిసెంబర్ వరకు నమోదైన వివరాల్లో విద్యార్థుల సంఖ్యకు సంబంధించి వ్యత్యాసాలు, సుమారు రూ.1.40 కోట్ల నిధుల దుర్వినియోగంపై వార్తల్లో వచ్చిన అంశాలను అధికారులు పరిశీలించాలని కోరారు. డీఈఓ లాగిన్‌లోని అసలు, సవరించిన ఇండెంట్లు, మార్పుల వివరాలు, హాజరు, సరఫరా రికార్డులు, బిల్లులు, చెల్లింపులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించాలని, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సరఫరా కాంట్రాక్టర్ లైసెన్స్‌ను కూడా పరిశీలించాలని కోరారు. ఆరోపణలు నిరాధారమని తేలినా అధికారికంగా వెల్లడించాలని సూచించారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. అంకన్న, జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:–** రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరు రూరల్ పరిధిలోని దొంతాళి డంపింగ్ యార్డును పరిశీలించి చెత్త ప్రాసెసింగ్ పనులను సమీక్షించారు.రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన చెత్తలో ఇప్పటికే పెద్ద మొత్తంలో తొలగింపు, ప్రాసెసింగ్ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గుంటూరు, విశాఖపట్నంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా రోజుకు సుమారు 2,800 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల పనులు కొనసాగుతున్నాయని, మరో ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. దొంతాళిలో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్తను సేకరించి ప్రాసెస్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం అమలు చేస్తామని మంత్రి తెలిపారు. చెత్త నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకాంతుల్లో శ్రీ వేంకటాద్రిశుని దివ్య విహారం

### గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు

### భక్తిపారవశ్యంలో స్వర్ణరథాన్ని లాగిన మహిళలు

### శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణరథంపై శ్రీ మలయప్పస్వామి





**తిరుమల, మన జనప్రగతి సెప్టెంబరు 20:–** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు. **కన్నులపండువగా స్వర్ణరథోత్సవం** మంగళవాయిద్యాల నడుమ స్వర్ణరథోత్సవం కన్నులపండువగా సాగింది. స్వామివారి దర్శనం కోసం తిరుమాడ వీధులకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు "గోవిందా.. గోవిందా.." అంటూ గోవిందనామస్మరణతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.స్వర్ణకాంతులతో మెరిసిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. **భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన మహిళలు** స్వర్ణరథోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. మహిళల భక్తి, గోవిందనామస్మరణ, మంగళవాయిద్యాల నడుమ స్వర్ణరథం తిరుమాడ వీధుల్లో ముందుకు సాగడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. **శ్రీవారి స్వర్ణరథానికి ఆధ్యాత్మిక విశిష్టత**శ్రీవారి స్వర్ణరథోత్సవానికి ఆధ్యాత్మికంగా విశిష్ట స్థానం ఉంది. శ్రీదేవి సంపదకు, భూదేవి సమస్త ధాన్యసంపదకు ప్రతీకలుగా భావిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై విహరించడం స్వామివారి వైభవం, సార్వభౌమత్వానికి ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారు.స్వర్ణరథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవడం ద్వారా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి అనుగ్రహంతో సకల శుభాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ధాన్యసమృద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం.ఈ స్వర్ణరథోత్సవంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో శ్రీమలయప్ప

### రామభక్త హనుమంతునిపై భక్తులను కటాక్షించిన శ్రీమలయప్ప





**తిరుమల, మన జనప్రగతి సెప్టెంబరు 20 :–** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు కోదండరాముని అలంకారంలో హనుమంత వాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ హనుమంత వాహనసేవ భక్తి పారవశ్యంతో వైభవంగా సాగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందాడ గోవిందాడ" అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. **హనుమంత వాహనం భగవద్భక్తికి ప్రతీక** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు శ్రీరామావతారంలో తన పరమభక్తుడైన హనుమంతునిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులలో అగ్రగణ్యుడైన హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి, సేవాభావం, శరణాగతికి ప్రతిరూపంగా నిలుస్తాడు.గురుశిష్యులైన శ్రీరాముడు, హనుమంతుల దివ్యసంబంధం భక్తి, జ్ఞానం, సేవాతత్వాల సమన్వయాన్ని చాటిచెబుతుంది. హనుమంత వాహనంపై కోదండరాముని దర్శించుకోవడం ద్వారా భక్తులకు భగవద్భక్తి, ధర్మనిష్ఠ, శరణాగతి భావాలు మరింతగా పెంపొందుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం.ఈ వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

### శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో రాయచోటి పట్టణం మహబూబ్‌నగర్ వాసుల చేరిక



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు సాహిత్య థియేటర్ వెనుక ఉన్న మహబూబ్‌నగర్‌లో 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. అహమ్మద్, రియాజ్‌లతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన వారిని శ్రీకాంత్‌రెడ్డి ఆత్మీయంగా స్వాగతించారు. వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, విలువ, గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో స్థానికంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.**శ్రీకాంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం**మహబూబ్ నగర్ కు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి స్థానిక ప్రజలు, యువత ఆత్మీయ స్వాగతం పలికారు.యువతకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ కన్వీనర్ నవాజ్, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శులు జాఫర్ అలీ ఖాన్, షబ్బీర్, నాయకులు సుగవాసి శ్యామ్,అబూ బకర్,రైతు మిత్ర ఖాదర్ బాష తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో రంగిన్ వలీ,యాసిన్, మస్తాన్,అల్లా బక్ష్,నజీర్,జాగీర్,ఆయూబ్ తదితరులు ఉన్నారు

# ఉరవకొండలో వైసీపీ స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం



**ఉరవకొండ, మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక చర్యలు, కరువు పరిస్థితులపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఉరవకొండలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించింది. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పీఏసీ సభ్యుడు వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ కమిటీలకు సంబంధించిన ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమన్వయంతో సిద్ధం కావాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నిధులు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, సాగునీటి సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. హంద్రీ–నీవా నీటి వినియోగంపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రతి మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి పార్టీ కమిటీలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 28న రైతుల సమస్యలపై నిర్వహించనున్న ధర్నాలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో ఉరవకొండ అబ్జర్వర్, మడకశిర వైసీపీ నాయకుడు గోవర్ధన్ రెడ్డి, రాయలసీమ ఫోరం కన్వీనర్ రమణ, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరు అశోక్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేంపల్లెలో ఘనంగా అజ్జుగుట్టు రఘునాధ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 20:** టిడిపి మండల ఇన్ చార్జ్ రఘునాథ్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం టిడిపి ఇన్ చార్జ్ రఘునాథ్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బిసి నాయకుడు డక్కా రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే టిడిపి కార్యకర్తలకు, ప్రజలకు పంపిణీ చేశారు. తమ నాయకుడి పుట్టిన రోజు వేడుకలను చేపట్టడం సంతోషంగా ఉందని బిసి నాయకుడు డక్కా రమేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప్పు కుమార్ , పామిశెట్టి ఆంజి, డక్కా రమణ, ఈశ్వరయ్య, కేశవ, యోగంజి రెడ్డి,రమణ, సుధీర్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో అపశృతి!

### - విద్యుత్ షాక్‌తో విద్యార్థి పరిస్థితి విషమం!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:** ప్రొద్దుటూరువినాయక నిమజ్జన వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ వీధిలో వినాయక ప్రతిమ వద్ద విద్యుత్ షాక్‌కు గురై డిప్లొమా విద్యార్థి సందీప్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వినాయక ప్రతిమ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బాక్స్ బోర్డును తాకడంతో సందీప్‌కు విద్యుత్ షాక్ తగిలినట్లు సమాచారం. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్న సందీప్ పరిస్థితి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు స్థానికులు వెల్లడించారు. కాగా, నేడు సందీప్ పుట్టినరోజు కావడంతో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆవేదనకు గురిచేసింది.కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సందీప్ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు అక్కడివారిని కలచివేసింది.

## కాంగ్రెస్ నేత పూల నజీర్‌పై దాడి.. ఐదుగురికి గాయాలు!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి సెప్టెంబర్ 20:** కాంగ్రెస్ పార్టీ నేత పూల నజీర్, ఆయన కుమారుడు సహా ఐదుగురిపై ఆదివారం దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురు గాయపడగా, క్షతగాత్రులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. ఆటోనగర్‌లో స్క్రాప్ లోడింగ్ విషయంలో కొద్దిరోజుల క్రితం పూల నజీర్, షాషా మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కొందరు కిరాయి వ్యక్తులతో కలిసి షాషా దాడికి పాల్పడినట్లు సమాచారం.ఈ ఘటనలో నజీర్ వర్గానికి చెందిన ముగ్గురు, షాషా వర్గానికి చెందిన ఇద్దరు గాయపడినట్లు తెలుస్తోంది. ఘటనపై ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ రాజు విచారణ చేపట్టారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేమకల్లు వద్ద కలకలం.. బావిలో ఎలుగుబంటి



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:** -మండల పరిధిలో నేమకల్లు గ్రామ సమీపంలోని పాడుబడ్డ బావిలో ఎలుగుబంటి పడి బయటకు రాలేక నరకయాతన అనుభవిస్తోంది,శనివారం రాత్రి కురిసిన వర్షానికి కంపచెట్ల మధ్య దాక్కునేందుకు వెళ్లిన ఎలుగుబంటి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు,ఆదివారం మధ్యాహ్నం బావిలో ఎలుగుబంటి ఉన్నట్లు గుర్తించిన గ్రామస్థులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు,గతంలోనూ ఇదే ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచరించినట్లు స్థానికులు తెలిపారు,బావిలో పడిన ఎలుగుబంటిని సురక్షితంగా బయటకు తీసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు,

## చెత్తపై వైసీపీ నేతల ఆరోపణలు అవాస్తవం: మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి, సెప్టెంబర్ 20:-** డంపింగ్ యార్డుల్లో చెత్తను కాలుస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నెల్లూరు నగరంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు.చెత్త కుళ్లే సమయంలో బయోగ్యాస్, మిథేన్ వాయువు ఏర్పడటం వల్ల కొన్ని సందర్భాల్లో మంటలు చెలరేగుతాయని మంత్రి తెలిపారు. కారణాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ అంశంపై రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.తనపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, పేదల సమస్యలు తనకు తెలుసని చెప్పారు. నెల్లూరు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు పేదలకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

## వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలి: కమిషనర్ జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నగరంలోని గోవిందరాజస్వామి ఆలయం పరిసరాలు, రాజన్న పార్కు, విష్ణు నివాసం, బస్టాండ్, రైల్వే స్టేషన్, అన్నమయ్య సర్కిల్, జూ పార్కు రోడ్డు, అలిపిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటాన్ని గమనించిన కమిషనర్ వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో నీరు సజావుగా వెళ్లేలా చెత్త తొలగించాలని తెలిపారు. యాత్రికులు తిరిగే ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న జీవీపీ (చెత్త కుప్పలు) పాయింట్లను పరిశీలించి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్ కూడలి వద్ద తుడా కాంప్లెక్స్ ముందు చెత్త అధికంగా ఉండటాన్ని గమనించి వెంటనే శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు.శ్రీనివాసం, విష్ణు నివాసం పరిసరాల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలిపిరి మార్గంలో అక్కడక్కడా దెబ్బతిన్న డివైడర్లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలని సూచించారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంతో పాటు మౌలిక వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటేషన్ సూపర్వైజర్ సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.ం

## అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 42000 ఇవ్వాలి




**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 20:** అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 42,000 ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు. కందారపు మురళి పిలుపు ఇచ్చారు. రైల్వే కోడూరు ఎన్జీవో హోం లో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడుదారులు, అమెరికా సామ్రాజ్యవాదులకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని. లాభాల కోసం దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు, అందరి సమస్యలు తీర్చగలిగేది, తిండి, బట్ట, విద్య, ఉద్యోగం, సమాన అవకాశాలు ఉండేది, దోపిడీ లేని సమాజం సోషలిజంలోనే అన్నారు. సోషలిజం లేదు, కమ్యూనిజం లేదు, అని చెప్పే పాలకవర్గాలకు, రాజస్థాన్ ఎడారి లోని మున్సిపాలిటీలో మతోన్మాద పార్టీని ఓడించి ఎర్రజెండా ఎగిరిందని గుర్తు చేశారు. భవిష్యత్తు సోషలిజందే అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల వాగ్దానాలు, విస్మరించాయన్నారు. రెగ్యులర్ చేయడం గాని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం, అన్ని రకాల ధరలు పెరిగినా కార్మికుల కనీస వేతనాలు చాలా కాలం నుండి పెంచడం లేదని, ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలని మోసం చేశారని, జీఎస్టీ పేరుతో బారాలు మోపి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ యూపీఐ చార్జీల పేరుతో కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు అన్నారు. ఏడాది పాటు రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా పోరాడి చట్టాల రద్దును సాధించారన్నారు. ఢిల్లీ విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. వారి స్ఫూర్తితో, ఉద్యోగులు కార్మికులందరూ ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, ఏపీఎండిసీ పోరాట జేఏసీ కన్వీనర్, ఆర్ వెంకటేష్, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్ త్రివేణి నాయకులు, ముత్యాల శ్రీనివాసులు ,పులగంటి శ్రీనివాసులు, విజయ్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు, శ్రీలక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్, పి జాన్ ప్రసాద్, పెనగలూరు మండల కన్వీనర్, బి,శిరీషా, వివోఏ, ఆనిమేటర్స్, జిల్లా నాయకులు, నగిరిపాటి, ఆనంద్, బివి రమణ, రోజా, అమరావతి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు, ఎం.సుబ్బరాయుడు, అంకయ్య, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు, బి.రాజశేఖర్, ఏపీ రైతు సంఘ రాష్ట్ర నాయకులు పంది కాళ్ళ మణి పాల్గొన్నారు.

## మంత్రిపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదు-గిరిధర్ రెడ్డి

### ● ఎంఎల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్వీట్ వార్నింగ్



**నెల్లూరు మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** పేదల కోసం పనిచేస్తున్న మంత్రి నారాయణపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడండి,అవాకులు, చెవాకులు పేలడం మానకపోతే ప్రజలే బుద్ధి చెబుతారంటూ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.వైఎస్ఆర్సీపీ లో తన పదవిని కాపాడుకునేందుకే చంద్రశేఖర్‌రెడ్డి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.చెత్తపై పన్ను వసూలు చేసిన ఘనత వైసీపీదేనన్నారు.ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు.మంత్రి నారాయణ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతుంటే ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని అన్నారు.వైసీపీ హయాంలో ప్రతీ పనికి 50 శాతం కమీషన్లు తీసుకునేవారని,అదే విధానం ఇప్పుడు కూడా ఉంటుందని అనుకోవడం పొరపాటని గిరిధర్‌రెడ్డి అన్నారు.మంత్రి నారాయణపై ఆరోపణలు చేసే ముందు అవి ప్రజలు నమ్ముతారా లేదా అన్నది ఆలోచించుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకుని వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎవరి పనితీరును ఎలా అంచనా వేస్తారో ఫలితాల్లో తెలుస్తుందని అన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 21 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## పులివెందులలో రూ.6.55 లక్షలకు వినాయకుడి లడ్డు వేలం



**పులివెందుల, టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** పులివెందుల పట్టణంలోని మైత్రి లే-ఔట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలంలో గణనాథుడి లడ్డు రికార్డు ధర పలికింది. శ్రీపతి చిన్న బాలుడు, శ్రీపతి చక్రవర్తి కలిసి రూ. 6,55,116కు లడ్డూను దక్కించుకున్నారు.వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మైత్రి లే-ఔట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తుల సమక్షంలో లడ్డూ వేలం నిర్వహించారు. వేలంలో పలువురు భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొనగా, చివరకు శ్రీపతి చిన్న బాలుడు, శ్రీపతి చక్రవర్తి అత్యధికంగా రూ. 6,55,116 ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు.ప్రతి ఏడాది వినాయక ఉత్సవాల్లో లడ్డూ వేలం భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది. లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడటంతో వేలం ఉత్కంఠగా సాగింది. ఈ ఏడాది లడ్డూకు భారీ ధర రావడంతో నిర్వాహకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. పులివెందుల పట్టణంలో ఇప్పటివరకు వినాయక లడ్డూకు నమోదైన అత్యధిక ధర ఇదేనని నిర్వాహకులు తెలిపారు.వేలం అనంతరం లడ్డూను దక్కించుకున్న శ్రీపతి చిన్న బాలుడు, శ్రీపతి చక్రవర్తిని నిర్వాహకులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో భక్తులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెల్లూరు సిటీలో వేగంగా అభివృద్ధి పనులు

### డిసెంబర్ నాటికి పొర్లుకట్టలో మిగిలిన పనులు పూర్తి: మంత్రి నారాయణ



**నెల్లూరు,మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. జాకీర్ హుస్సేన్ నగర్‌లో రూ.57.25 లక్షలతో ఆధునీకరించిన వాటర్ ట్యాంకును ప్రారంభించడంతో పాటు జెండావీధిలోని పీఎన్ఎం హైస్కూల్, మున్సిపల్ ఉర్దూ పాఠశాలల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పొర్లుకట్టలో సీసీ రోడ్డు పనులను పరిశీలించి రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొర్లుకట్టలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామని, డిసెంబర్ నెలాఖరులోగా మరుగుదొడ్లు, కనెక్టివిటీ రోడ్లు, సంగం బ్యారేజ్ నుంచి మంచినీటి సరఫరా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో రూ.43 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.కార్యక్రమాల్లో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
21 - 09 - 2026

# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పిఎం శ్రీ కడప కేంద్రీయ విద్యాలయ పనితీరుపై జాయింట్ సెక్రటరీ ప్రశంసలు

**- 100 శాతం ఉత్తీర్ణత, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అభినందనీయం**




**కడప,మన జనప్రగతి సెప్టెంబర్ 20 :-** పిఎం శ్రీ పథకం కింద కడప కేంద్రీయ విద్యాలయంలో విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న తీరుపై.. భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ప్రశంసలు కురిపించారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, విద్యార్థుల సమగ్ర వికాసానికి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.పిఎం శ్రీ పథకం అమలు తీరు, పాఠశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలను సమీక్షించేందుకు కడప కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనా పనితీరును ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అనుకూలమైన అభ్యసనా వాతావరణం సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాలలో 59 కంప్యూటర్లు, 17 స్మార్ట్ తరగతి గదులు అందుబాటులో ఉండటం, ఉపాధ్యాయులు డిజిటల్ బోధనా పద్ధతులతో పాటు దీక్షా వేదికను క్రమం తప్పకుండా వినియోగించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా విద్యార్థులకు ఆహ్లాదకరమైన, కృత్యాధారిత బోధన అందించడం, జాదూయీ పిటారా వినియోగం, కృత్రిమ మేధస్సు ఆధారిత నైపుణ్య విద్యను అందిస్తున్న విధానాన్ని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంపొందించేలా రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాల ద్వారా విజ్ఞాన యాత్రలు నిర్వహించడం కూడా అభినందనీయమన్నారు.విద్యార్థుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన మార్గదర్శకాలను పాటిస్తూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాలపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు.కడప కేంద్రీయ విద్యాలయం సాధిస్తున్న ప్రగతిపై జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ఉపాధ్యాయ బృందాన్ని, ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనాను అభినందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హెచ్ ఎస్. భావన, డీఈవో శంశుద్దీన్, కేవీ కడప టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు (21వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం



**కడప,మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్న ట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

# హనుమద్ వాహనంపై శ్రీరంగనాథుడు



**పులివెందుల టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ సెప్టెంబర్ 20 :-** పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న నూలు పూజ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీరంగనాథస్వామి హనుమద్ వాహనంపై కొలువుదీరి ఆలయ పరిసరాల్లో ఊరేగారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారి వాహన సేవను దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన సేవ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 12 మందికి కంటి ఆపరేషన్లు







**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబరు 20:-** రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె,వీరబల్లి, యర్రావారి పాలెం,కేవీపల్లి,కలకడ,కలికిరి, పీలేరు, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్.పి.కుంట, చక్రాయపేట, కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 25 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,అద్దాలు పంపిణీ చేశారు.అనంతరం కంటి ఆపరేషన్ ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీలోని మొటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నారై ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప్ గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,ఏపీఐఐసి మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,కంటి వైద్యులు భార్గవి,ఆఫ్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా వేంపల్లి చైతన్య హైస్కూల్‌లో వినాయక నిమజ్జనం



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** వేంపల్లిలో వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ నృత్య ప్రదర్శనలు, ఆకట్టుకునే గెటప్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకోగా, ఉపాధ్యాయులు కూడా వారితో కలిసి కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహాన్ని మరింత పెంచారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి గారి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.వినాయక నిమజ్జన కార్యక్రమం భక్తి, సాంస్కృతిక వైభవం, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిసింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.

# కర్నూలు పోలీసులు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** కర్నూలు ఎస్పీవిక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# ఇది చింతల మడుగు పల్లి రోడ్డా లేక డంపింగ్ యార్డా?



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** వేంపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని చింతల మడుగు పల్లె కు వెళ్లే దారి డంపింగ్ యార్డ్ ను తలపించేలా చెత్త కుప్పలు పేరుకుపోయి ఆ దారిన వెళ్లే బాటసారులకు దుర్గంధం వెదజల్లుతూ ఇబ్బందికరంగా మారింది. పంచాయతీ సిబ్బంది ఎవరు అటువైపు కన్నెత్తైనా చూడలేదు. సమీపంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దాదాపు 250 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. దీనివల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తి టైఫాయిడ్, మలేరియా తదితర జబ్బులతో చిన్నారులను వారి తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిప్పుతూ ఆరోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి బాటసారులను మరియు విద్యార్థులను జబ్బుల బారి నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇన్చార్జి పి.వి.మోహన్‌ని కలిసిన నాయకులు




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి, ఎమ్మెల్సీ పి.వి. మోహన్ ని విజయవాడ ఆంధ్రరత్న భవన్ రాష్ట్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పత్తికొండ ఇన్చార్జి క్రాంతి నాయుడు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అనుబంధ విభాగాల జిల్లా చైర్మన్లు, మరియు నాయకుల బృందం కలిశారు.ఆదివారం పి.వి.మోహన్ ని శాలువాలతో, కండువాలతో ఘనంగా సన్మానించారు. మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు ఆర్సీ యువరాజుకి పీవీ మోహన్ పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం మోహన్ కు కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, మరియు కొందరు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగే విధంగా వ్యవహరిస్తున్న తీరును జిల్లా నాయకుల బృందం వివరంగా తెలియజేశారు. మోహన్ సానుకూలంగా స్పందించి జిల్లాతో సంబంధం లేని కొందరు జోక్యం చేసుకుంటున్నారని, అలాగే పార్టీకి నష్టం కలిగే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని నా దృష్టికి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. త్వరలో కర్నూలు జిల్లాకు వస్తానని స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం వివిధ అంశాల మీద కృషి చేద్దాం అని క్రాంతి నాయుడు కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం కాంగ్రెస్ నాయకులు ఆర్ సి యువరాజ్ ముస్లిం మైనార్టీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వశీ భాష, జిల్లా కాంగ్రెస్ నాయకులు చిన్న స్వామి మొదలగు నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం




**పీలేరు,మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** అన్నమయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కేవీ పల్లి మండలం సిబ్బాలవాండ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రావూరి సుబ్రహ్మణ్యాన్ని పీలేరు ఏపీఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఏపీఎస్ జిల్లా సహాధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని ప్రశంసించారు. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని సుబ్రహ్మణ్యం తెలిపారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి బుసగాని వేణుగోపాల్, ఉపాధ్యాయులు చంద్రకళ, నరేష్, పీలేరు మండల అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, గర్నిమిట్ట టీడీపీ గ్రామ కార్యదర్శి గుండ్లూరి శ్రీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

21 - 09 - 2026

# సర్పంచుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్

**హనుమకొండ,మన జనప్రగతి, సెప్టెంబరు 20:** వరంగల్ జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను సమష్టిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ నూతన అధ్యక్షుడు దండెం సంపత్ అన్నారు. గ్రామ పంచాయతీల హక్కులు, నిధులు, సర్పంచుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై జేఏసీ తరఫున నిరంతరం పోరాడుతామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు దండెం సంపత్‌ను వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్ ఆవరణలో జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.




మాజీ సర్పంచుల సంఘం కార్యదర్శి మెడెం సాగర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిస్థితులు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లడమే తన ప్రాధాన్యమని సంపత్ పేర్కొన్నారు. సర్పంచుల హక్కులను పరిరక్షించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన వనరులు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులను ప్రతినెలా విడుదల చేయాలని కోరారు. నిధుల లభ్యత గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.సర్పంచులు ప్రజల మధ్య నిరంతరం పనిచేస్తూ గ్రామస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. వారి బాధ్యతలు, పెరుగుతున్న వ్యయాలను దృష్టిలో ఉంచుకుని గౌరవ వేతనాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వి. శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో, సుర్వి యాదయ్య గౌడ్ నాయకత్వంలో సర్పంచుల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత సమన్వయంతో పనిచేస్తుందని సంపత్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్

**హనుమకొండ,మన జనప్రగతి, సెప్టెంబరు 20:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఉద్యమ కారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓదార్పు యాత్రలో భాగంగా నాలుగో రోజు కృష్ణకాలనీ, లేబర్ కాలనీ, గీసుకొండ పరిసర ప్రాంతాల్లో రవికుమార్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని ఉద్యమకారులను, వారి కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాలకుర్తి మండలానికి చెందిన ఉద్యమకారుడు రాబాక కొండయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయనకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.అంతకుముందు ఓదార్పు యాత్రలో భాగంగా శ్రీనివాస్ కాలనీ, దేశాయిపేట, ఎల్బీనగర్, లోతుకుంట, చార్‌బౌలి తదితర ప్రాంతాల్లో పర్యటించి పలువురు ఉద్యమకారులను, వారి కుటుంబాలను పరామర్శించినట్లు రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 75 మంది ఉద్యమకారులను సన్మానించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ.. మూడు రోజులుగా సాగుతున్న ఓదార్పు యాత్రలో





ఉద్యమకారుల ప్రస్తుత జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అనేక మంది ఉద్యమకారులకు తగిన గుర్తింపు, పదవులు, ఉద్యోగాలు, ఆర్థిక భరోసా, సంక్షేమ ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం 25 ఏళ్ల క్రితం పోరాడిన పలువురు ఉద్యమకారులు నేటికీ ఆర్థిక ఇబ్బందులతో జీవించడం బాధాకరమన్నారు. ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, అలాంటి వారిని విస్మరించడం సమంజసం కాదన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అర్హులైన వారిని గుర్తించాలని డిమాండ్ చేశారు. వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారి జీవన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు.తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ఆత్మబలిదానాలు చేశారని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని రవికుమార్ అన్నారు. ఉద్యమకారులను ఐక్యం చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు, వారికి దక్కాల్సిన హక్కులు, సంక్షేమ ఫలాలు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చాంద్ పాషా, బొలిశెట్టి అశోక్, నారాయణరెడ్డి, రాజమౌళి, కుమారస్వామి, మొలంగూర్ నెల్సన్, కేడల ప్రసాద్, నటరాజ్, రమేష్, రవీందర్, ఇమ్రాన్, అమ్జద్, స్వర్ణలత, శ్యామ్, స్వామి యాదవ్, మాధవీలత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవాళికి ఆదర్శం..

### ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పిలుపు..

### సఫాబైతుల్ మాల్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో సీరతున్నబి టాలెంట్ టెస్ట్

### జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా హాజరైన విద్యార్థులు

**పెద్దపల్లి, మన జనప్రగతి, సెప్టెంబరు 20:** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి ఆదర్శమని మజ్లిస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. రబివుల్ అవ్వల్ మాసం సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని చింతల వాడ క్రిస్టల్ గెస్ట్ హౌస్ లో.. సఫాబైతుల్ మాల్ పెద్దపల్లి జిల్లాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర పై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మౌలాన లయీఖుల్లా, మౌలాన ఇంతియాజ్ ఖాన్ అసాధిల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 200మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ సఫా బైతుల్ మాల్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రతిఏటా మహమ్మద్ ప్రవక్త జీవిత




చరిత్రను రాబోయే తరాలకు, యువతకు తెలపాల్సిన బాధ్యతను విద్యార్థుల మేదస్సు పెంచేందుకు సీరతున్నబి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయ మని మౌలాన ఇంతియాజ్ ఖాన్ అసాధిని అభినందించారు. వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉందన్నారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. టాలెంట్ టెస్ట్ రాసిన విద్యార్థులకు త్వరలో బహుమతులు ప్రధాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ముఫ్తి షఫీక్, మౌల్వి ఫైజాన్, మౌలాన సాబీర్ ఆలం, హాఫిజ్ ఆమెర్, ఖత్మె నబువ్వత్ కరీంనగర్ కార్యకర్తలు కలీమ్ షరీఫ్, ముఖ్రం, మహమ్మద్ రఫీ, హాఫిజ్ అబ్దుల్ రాఫి పాల్గొన్నారు.



# మాముసూరు ఎయిర్‌పోర్ట్‌కు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి

● తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్



**ములుగు ప్రతినిధి మన జనప్రగతి, సెప్టెంబరు 20:** మామునూరు విమానాశ్రయానికి బహుజన వీరుడు, గౌడ జాతి ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న మామునూరు విమానాశ్రయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్న నేపథ్యంలో,చారిత్రక ప్రాధాన్యత కలిగిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును విమానాశ్రయానికి పెట్టి ఆయనకు తగిన గౌరవం కల్పించాలని కోరారు.సామాజిక సమానత్వం,బహుజనుల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు.వరంగల్ ప్రాంతంతో పాపన్న గౌడ్‌కు ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తిస్తూ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం సముచితమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఆయన పోరాట స్ఫూర్తి, వీరగాథ భవిష్యత్ తరాలకు చేరుతాయని అన్నారు.గౌడలు,బహుజనులు,ఉత్తర తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని తోటకూరి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ● జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం.



**ములుగు జిల్లా మన జనప్రగతి, సెప్టెంబరు 20:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ములుగు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహించాలని ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అండగా ప్రజాసేవ నాయకుడు మజ్హర్ బాబా..





**కరీంనగర్ మన జనప్రగతి, సెప్టెంబరు 20:** కరీంనగర్ జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో మురికికాలువలు నిండి నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 31వ డివిజన్ ఖాన్‌పురాలోని టాటా ఆసుపత్రి సమీపంలో రహదారిపై వర్షపు నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, తీవ్ర స్థానికులు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రజా సేవా నాయకుడు మజ్హర్ బాబా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేసి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. వర్షపు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని మజ్హర్ బాబా సూచించారు.

# కరీంనగర్‌లో దొంగల హల్‌చల్.. గ్యాస్ కట్టర్లతో రెండు ఏటీఎంల లూటీ..




**కరీంనగర్ జిల్లా మన జనప్రగతి, సెప్టెంబరు 20:** కరీంనగర్: జిల్లాలో తెల్లవారుజామున దుండగులు రెండు ఎస్.బీ.ఐ ఏటీఎంలను టార్గెట్ చేసి నగదు అపహరించడంతో కలకలం రేగింది. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్శేడు, ఎల్ఎండి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. దుర్శేడు ఏటీఎంలో సుమారు 3.30 గంటల సమయంలో దుండగులు ప్రవేశించి సీసీ కెమెరాలను దెబ్బతీసి, గ్యాస్ కట్టర్‌తో క్యాష్ మిషన్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ. 8 లక్షలు అపహరించినట్లు ప్రాథమిక సమాచారం.తిమ్మాపూర్ ఏటీఎంలోనూ ఇదే తరహాలో చోరీ జరగగా, అపహరించిన నగదు వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సీసీ కెమెరాలను పనిచేయకుండా చేసేందుకు దుండగులు స్ప్రే చేసినట్లు పోలీసులు గుర్తించారు. దుర్శేడు ఘటనలో దుండగులు వాహనంలో వచ్చినట్లు సీసీటీవీ ఆధారాలు లభించాయి.దుర్శేడు ఏటీఎంలో చోరీ జరుగుతున్న సమయంలో ఎస్బీఐ కేంద్ర కార్యాలయానికి అలారం వెళ్లడంతో స్థానిక అధికారులను అప్రమత్తం చేసినట్లు సమాచారం. పోలీసులు రెండు కేసులు నమోదు చేసి, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



మనజనప్రగతి

21 - 09 - 2026

# ప్రొద్దుటూరులో ఇంటాక్ చాప్టర్ ఏర్పాటు

**కన్వీనర్‌గా డా. కాకర్ల బాలకృష్ణారెడ్డి ఏకగ్రీవం**

**కో కన్వీనర్‌గా జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, అదనపు కో కన్వీనర్‌గా గజ్జల వెంకటేశ్వరరెడ్డి ఎంపిక**




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** భారతీయ కళలు, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) ప్రొద్దుటూరు చాప్టర్‌ను ఆదివారం స్థానిక టీవీ బంగ్లా కాంప్లెక్స్‌లోని మాస్టర్స్ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు చాప్టర్ కన్వీనర్‌గా డా. కాకర్ల బాలకృష్ణారెడ్డిని, కో కన్వీనర్‌గా లయన్ జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్‌ను, అదనపు కో కన్వీనర్‌గా రోటేరియన్ పీహెచ్‌ఎఫ్ గజ్జల వెంకటేశ్వరరెడ్డిని సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కడప చాప్టర్ కన్వీనర్, సెంట్రల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు కంభం చిన్నపరెడ్డి, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ఇంటాక్ భారతీయ కళలు, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు విశేష కృషి చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాల ద్వారా ప్రజల్లో వారసత్వ సంపదపై అవగాహన కల్పిస్తూ, సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచిన చారిత్రక సంపదను కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, సమాజ భాగస్వామ్యంతో వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కడప చాప్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ప్రాంతాలకు చెందిన శాశ్వత సభ్యుల సహకారంతో ప్రొద్దుటూరులో ప్రత్యేక చాప్టర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నూతన కమిటీ సభ్యులు ఐకమత్యంతో, సమన్వయంతో పనిచేస్తూ ఇంటాక్ నియమ నిబంధనలకు అనుగుణంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివిధ కమిటీలను ఏర్పాటు చేసుకుని సభ్యుల సంఖ్యను పెంచడంతో పాటు కళలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీకి, సభ్యులకు అభినందనలు తెలిపారు.

# ప్రమాణానికి సిద్ధమా? బంగారు ముని రెడ్డి సవాల్!

**- టౌన్ బ్యాంకు వ్యవహారం పై సవాలు! ప్రతి సవాలు!!**




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 20:-** టౌన్ బ్యాంకు వ్యవహారాలు, ఇన్సూరెన్స్ కేసులపై టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి చేసిన ప్రకటనలకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి స్పందించారు. ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు తాము కాణిపాకం వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, సుధాకర్‌రెడ్డి కూడా రావాలని సవాల్ చేశారు. ఆదివారం ప్రొద్దుటూరు ఆర్ట్ కాలేజీ రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మునిరెడ్డి మాట్లాడుతూ.. కరెంట్ ఆఫీసులో ఉద్యోగిగా పనిచేస్తున్న ఉషారాణిని వెంట తీసుకువచ్చి, టౌన్ బ్యాంకులో ఖాతా ప్రారంభించే సమయంలో ఇతరుల పేర్లు, పత్రాలతో ఇంట్రడ్యూసర్‌గా సంతకం చేయలేదని ఇద్దరూ ప్రమాణం చేయాలని కోరారు. టౌన్ బ్యాంకులో తాను కోట్ల రూపాయలు డిపాజిట్ చేశానని సుధాకర్‌రెడ్డి చెప్పడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి 2017 నుంచి వివిధ ప్రజల కోసం తన సొంత డబ్బు రూ.17.50 లక్షలు డిపాజిట్ చేశారని తెలిపారు. సుధాకర్‌రెడ్డి కూడా తన సొంత డబ్బుతో ఎవరికి సహాయం చేశారో వెల్లడించాలని ప్రశ్నించారు.

# పి.కొత్తపల్లి పీహెచ్‌సీలో సిబ్బంది లేక రోగుల అవస్థలు

**- ఆదివారం వైద్య సేవలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై పేషెంట్ల ఆగ్రహం**



**సిద్ధవటం, మన జనప్రగతి, సెప్టెంబరు 20:-** సిద్ధవటం మండలంలోని పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చికిత్స కోసం వచ్చిన పేషెంట్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యశాల తలుపులు తెరిచి ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించే సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని వారు తెలిపారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక సీహెచ్‌ఓ, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక హెల్త్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉన్నప్పటికీ ప్రస్తుతం సిబ్బంది కొరత ఉందని వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. ముగ్గురు స్టాఫ్ నర్సుల్లో ఇద్దరు బదిలీ కాగా, మిగిలిన ఒక్క స్టాఫ్ నర్స్ శనివారం రాత్రి నైట్ డ్యూటీ చేయడంతో ఆదివారం విధులకు హాజరు కాలేదని వివరించారు. వైద్యశాలను తెరిచి ఉంచాలని ఎస్ఎన్ఓ సుదర్శన్‌రెడ్డికి సూచించినట్లు తెలిపారు. సిబ్బంది కొరత విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు డాక్టర్ రంగలక్ష్మి పేర్కొన్నారు. ఈ సమస్యను కడప డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నారెడ్డి తెలిపారు.

# కాచిగూడలో భక్తిశ్రద్ధలతో దివ్య పూజ, మహా హారతి కార్యక్రమం




**హైదరాబాద్, మన జనప్రగతి, సెప్టెంబరు 20:** బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో కాచిగూడ కార్యాలయంలో ఆదివారం దివ్య పూజ మరియు మహా హారతి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివసేన రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, రాఘవ, అభినయ్ తివారీ, రామేశ్వర్ మిశ్రా, ప్రవీణ్ యాదవ్, సంజయ్ దాయమా, కొండల్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొని భక్తిప్రపత్తులతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐక్యమత్యం మరియు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీనగర్‌లో ఘనంగా మహా అన్నదానం

**- గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ**







**మల్లంపల్లి మన జనప్రగతి, సెప్టెంబరు 20:** మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి మండపానికి చేరుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేసి అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలు, నిర్వాహకులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# డాక్టర్ జగదీష్ మృతి అత్యంత బాధాకరం

**- ఎల్.హెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు భద్రు నాయక్, ఉపేంద్ర బాయి**



**ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి, సెప్టెంబరు 20:** మానవత్వం, సేవాభావంతో వైద్య వృత్తిలో ఎంతో మంది పేదల జీవితాలలో వెలుగులు నింపిన ప్రజా వైద్యులు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్ ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్.హెచ్.పి.ఎస్) రాష్ట్ర అధ్యక్షులు బానోతు భద్రు నాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి చెప్పారు. ఆదివారం ఉదయం సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ జగదీష్ మృతి చెందటం తమ హృదయములను తీవ్రంగా కలచి వేసిందని పేర్కొన్నారు. చాలామంది పేదల జీవితాలలో వైద్యం ద్వారా వెలుగులు నింపి, వారికి ఒక ఆశా కిరణంగా నిలిచిన డాక్టర్ జగదీష్ చిన్న వయసులోనే మృతి చెందడం నమశక్యం కావడం లేదన్నారు. ఇలాంటి విషాద వార్త ఈ ఆదివారం వినవలసి రావడం దురదృష్టకరమన్నారు. మంచి మనిషిగా, అందరికీ ఆప్తుడుగా నిలిచిన డాక్టర్ జగదీష్ ను కోల్పోవడం విచారకరమన్నారు. దేవుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నీర్నంలలో జాతి రత్నాలు యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



**రామన్నపేట, మన జనప్రగతి, సెప్టెంబరు 20:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో వినాయకుని పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతి రత్నాలు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జాతి రత్నాలు యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మాలతి పార్థివ దేహానికి నివాళు లర్పించిన విజయసారథి



**మహబూబాబాద్ మన జనప్రగతి, సెప్టెంబరు 20:** మాలతి పార్థివ దేహానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయ సారథి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలోని 30 వార్డు వాస్తవ్యుడు ప్రముఖ ఉపాధ్యాయుడు కందుల ప్రేమ్ కుమార్ సతీమణి ఉపాధ్యాయురాలు కందుల మాలతి మృతిచెందగా ఆదివారం వారి గృహానికి వెళ్లి మృతురాలు మాలతి పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, 18 వ వార్డు కౌన్సిలర్ దేశపల్లి నవీన్ లింగాల విజయ్ వంకాయలపాటి చిరంజీవి, బోళ్ల భద్రయ్య కోన సత్యం మంద రవి గొల్ల గోపు కిషోర్ ఉన్నారు.

# వార్డు సభ్యుల ఫోరమ్ అధ్యక్షుడికి ఘన సన్మానం

**షాద్‌నగర్ ఫోరమ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్**

**వార్డు సభ్యుల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు**



**షాద్ నగర్, మన జనప్రగతి, సెప్టెంబరు 20:** తెలంగాణ వార్డు సభ్యుల ఫోరమ్ షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎన్నికైన మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్‌ను మాజీ రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు జిల్లెల వెంకటరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వార్డు సభ్యుల సమస్యలను సమానంగా పరిష్కరించేందుకు ఫోరమ్ కృషి చేయాలని సూచించారు. వార్డు సభ్యుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ఫోరమ్ నాయకులు, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వార్డు సభ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అంతిరెడ్డిగూడ 8వ వార్డు సభ్యురాలు శోభ ఆంజనేయులు, 7వ వార్డు సభ్యుడు జంగా శ్రీనివాసు, నందిగామ నెహ్రూ బాబు, అయిత నరేష్, వెంకట్రాంరెడ్డి, గుర్రంపల్లి యాదయ్య, పరమేష్, ధర్మేంద్ర, జంగ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

● బ్రహ్మోత్సవ సేవకులకు వస్త్రాలు అందించిన వేమిరెడ్డి దంపతులు



**తిరుమల, మన జనప్రగతి 2026 సెప్టెంబరు 20:–** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మేళం సిబ్బందికి ఆదివారం వస్త్ర బహుమానం అందించారు.నెల్లూరు లోకసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిసి ఈ వస్త్ర బహుమానాన్ని అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను అందించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సేవలందించే సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నారని తెలిపారు. స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న సిబ్బందిని ప్రోత్సహిస్తూ వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు.శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని అదనపు ఈవో ఆకాంక్షించారు.

# ఆంధ్ర కాపు సద్భావన సంఘం తాత్కాలిక నూతన అధ్యక్షుడిగా ముమ్మిడి

**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** కాపు సద్భావన సంఘం స్థాపించిన నాటినుండి అధ్యక్షుడిగా వాసిరెడ్డి ఏసుదాసు ఇప్పటివరకు కొనసాగుతూ వచ్చారు కానీ ఆయన పని ఒత్తిడిలో సంఘంపై పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించలేని పరిస్థితిలో ఉన్నారు. కనుక ఆంధ్ర కాపు సద్భావన సంఘం నూతన అధ్యక్షుడిగా ముమ్మిడి సత్యనారాయణ ను ఆదివారం శుభం కాపు కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు బసవ ప్రభాకర్ రావు, చిట్నీడి శ్రీనివాస్, సలాది మూర్తి, మాట్లాడుతూ కాపు సద్భావన సంఘం, ఆంధ్ర కాపు సద్భావన సంఘంగా మారిందని ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ విస్తరణలో భాగంగా జిల్లాల్లో కూడా మార్పులు రావడంతో కాపు సద్భావన సంఘాన్ని ఆంధ్ర కాపు సద్భావన సంఘంగా



రిజిస్టర్ కాబడిందని ఈ సంఘానికి వాసిరెడ్డి ఏసుదాస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని కానీ వారికి సంఘం అభివృద్ధికి సమయం కేటాయించే పరిస్థితి ప్రస్తుతానికి లేనందున తాత్కాలిక నూతన అధ్యక్షుడిగా ముమ్మిడి సత్యనారాయణను ఏకగ్రీవంగా నియమించడం అయిందని తెలిపారు. నూతన అధ్యక్షుడు ఉమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే కాలంలో సంఘానికి తన పూర్తి సమయాన్ని కేటాయిస్తూ యువత విద్యకు కావలసిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తానని సంఘానికి తన వంతు సహాయం చేస్తూ అందరినీ కలుపుకుపోతూ సంఘాన్ని బలోపేతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జే రంగనాయకులు, అడబాల సత్యనారాయణ, రెడ్నం రాజా, అప్పారావు, కొప్పిశెట్టి శ్రీను, గంగిరెడ్డి మూర్తి ,జంక్షన్ బాబ్జి, అడపా ప్రకాశరావు, పాల్గొన్నారు.

# కలకడలో వైసీపీ నుంచి టీడీపీలోకి 200 మైనార్టీ కుటుంబాలు



**కలకడ, మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** అన్నమయ్య జిల్లా కలకడ పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ దండు జిలాని, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుల్తానితో పాటు సుమారు 200 ముస్లిం మైనార్టీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సమక్షంలో వారు టీడీపీ కండువాలు కప్పుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. విద్య, పింఛన్లు, ఇమామ్‌లు, మౌజమ్‌ల గౌరవ వేతనాలు, హజ్ యాత్ర, మైనార్టీ సంక్షేమం తదితర అంశాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.పీలేరు నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.టీడీపీలో చేరిన మైనార్టీ కుటుంబాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్..



**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** నియోజకవర్గంలోని. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చిన్నక్క. సుబ్బరాయుడు దంపతులకు చెందిన. శ్రావణి, బొమ్మి సురేష్ వివాహానికి రైల్వే కోడూరు శాసనసభ్యులు . అర్వ శ్రీధర్ . మరియు రైల్వే కోడూరు టిడిపి యువ నాయకులు హాజరయ్యి వధూవరులను ఆశీర్వదించారు. పెంచలకోనలో జరిగిన వివాహానికి పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు బంధుమిత్రులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పులి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా ముగ్గురాయి విక్రమించిన మిల్లులు బ్లాక్లిస్టులో పెట్టిన అధికారులు



**ఓబులవారిపల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** ఓబులవారిపల్లి మండలం మంగంపేట. ఏపీఎండిసిల పరిధిలో, కొంతమంది పల్లవి రేజింగ్ బిల్లు యజమానులు. అక్రమంగా కొన్ని ఎక్స్పోర్ట్ మిల్లులకు అక్రమ ముగ్గురాయిని విక్రయించినందుకు హామీలను ఏపీఎండీసీ అధికారులు బ్లాక్లిస్టులో పెట్టడం జరిగిందని విశ్వసినీ సమాచారం. ఎక్స్పోర్ట్ కంపెనీలకు ముగ్గురాయిని విక్రయించకూడదని నిబంధనలు ఉండడంతో కొంతమంది ఉద్యోగులు సంస్థలో పనిచేస్తూ ముగ్గురాయి వ్యాపార లావణ్యలు సాగిస్తూ ఉంటారు.. కానీ కొంతకాలం వాళ్ళ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలు గా వర్ధిల్లింది విరాజిల్లింది అయితే ప్రస్తుతం ఏపీఎండిసి సంస్థ నిబంధనలు మేరకు అక్కడ ఎటువంటి తావు లేకుండా . నిష్పక్షపాతముగా విధులు నిర్వహించడంతో వారికి ముగ్గురాయి విక్రయించిన విషయం సమాచారం అందరంతో ఆ ఉద్యోగుల పలవరేజింగ్ బిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగిందని తెలుస్తోంది ఏదేమైనా భర్తల ఉద్యోగం, భార్యలు బడా వ్యాపారం ముగ్గురాయి వ్యాపారం చేస్తూ ఉండడంతో వీరి బంగారం బట్టబయలు అయిందని పలువురు విమర్శిస్తున్నారు ఏది ఏమైనా సీసీ కెమెరాలు కళ్ళు కప్పి కూడా గతంలో కొంతమంది ముగ్గురాయిని పక్క దావ పట్టించారని విమర్శలు లేకపోలేదు ఏది ఏమైనా కోటను ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ ఏపీఎండిసి ముగ్గురై అక్రమ రవాణా తావు లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది ఈ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో మంగంపేటలో పలువురు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు

# కేశఖండన కార్యక్రమానికి హాజరైన శ్రీకాంత్‌రెడ్డి

● కమలామర్రిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆత్మీయ మమేకం



**గాలివీడు మన జనప్రగతి సెప్టెంబర్ 20:–**
గాలివీడు మండలం చీమలచెరువుపల్లె గ్రామం కమలామర్రికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు శంకర్‌రెడ్డి కుమారుని కేశఖండన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కమలామర్రిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీకాంత్‌రెడ్డిని ఆత్మీయంగా కలుసుకున్నారు. వారితో మమేకమైన ఆయన స్థానికంగా పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ సెల్ కోఆర్డినేటర్ జల్లా సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లె యధుభూషణ్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, గుమ్మా అమరనాథరెడ్డి,కేశవ రెడ్డి,కృష్ణారెడ్డి, రామేశ్వర్ , భయ్యారెడ్డి, మస్తాన్, ధనంజయ రెడ్డి, అక్రమ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు...

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** వేంపల్లె శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కడప జిల్లా అవోపా అధ్యక్షులు గూడూరు హరికృష్ణ, వేంపల్లె అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఆర్థో,న్యూరో, ఆప్తమాలజీ,గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ సమస్యలకు సంబంధించిన డాక్టర్లు 324 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు.బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు.జిల్లా అవోపా అధ్యక్షులు గూడూరు హరికృష్ణ,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చిట్టెం రమేష్ బాబు,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ వేంపల్లె అవోపా యూనిట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.వైద్య శిబిరం అనంతరం డాక్టర్లను, వారి సిబ్బంది శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ,అవోపా కార్యవర్గ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# లింగాలలో పదును వర్షం



**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 20:–** మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పూర్తిస్థాయి పదును అయింది. ఈ ఏడాది ఏలినినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో నైరుతి రుతుపవనాల వల్ల వర్షాలు కురవలేదు. దీంతో గత కొన్ని మాసాలుగా వర్షాభావ పరిస్థితులవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి త్రాగునీటి కోసం ప్రజలు, సాగు నీటి కోసం రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడాది ఎలినినో ప్రభావంతో వర్షాలు కురవక భయంకరమైనటువంటి కరువు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు కూడా హెచ్చరించారు. ప్రస్తుతం ఎలినినోను ఆక్రమించేందుకు మాడెన్– జూలియన్–అషిలేషన్ ఏర్పడడం శుభదాయకమని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ ఎంజెఓ వల్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెప్పడంతో మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా వర్షాలు లేక ఉక్కపోతతో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. గత శనివారం రాత్రి కురిసిన వర్షంతో భూతాపం చల్లబడడంతోపాటు, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం

- రూ.84 వేలతో లడ్డూ దక్కించుకున్న మేరువ కోదండరామయ్య





**సిద్దవటం, మన జనప్రగతి, సెప్టెంబరు 20: –** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ, శ్రీ సీతారాముల దేవస్థానంలో ఏడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న శ్రీ వినాయకుడికి ఆదివారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. ఉదయం 9గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివారి ప్రసాదమైన ప్రత్యేక లడ్డూకు వేలంపాట నిర్వహించగా, అదే గ్రామానికి చెందిన మేరువ కోదండరామయ్య రూ.84 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే 10 గ్రాముల వెండి నాణెం రూ.25 వేలకు నూకల నవీన్‌కుమార్, కలశం రూ.11,600 లకు సోమా వెంకటేశు దక్కించుకున్నారు. వేలంపాటలో విజేతలను ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించి శాస్త్రోక్తంగా సాగనంపారు. అనంతరం బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాలు, టపాసుల సందడితో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొనగా స్వామివారి విగ్రహాన్ని సాంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా తీసుకెళ్లి సిద్దవటం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174